క్లుప్తంగా

కుట్ర రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలి



ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు అన్నారు. తుని మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ ఎన్నిక జరగకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి క్లెం వేయడంలో భాగంగా మంగళవారం చలో తుని కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఉదయం 8 గంటలకు తునిలోని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి నివాసానికి చేరుకోవాలని సూచించారు.

'చలో తుని' ని విజయవంతం చేయాలి

కోటనందూరు: కూటమి నేతల దౌర్జన్యాల నేపథ్యంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నిర్వహించే చలో తుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సోమవారం పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అరెస్టు



కోటనందూరు పోలీసుస్టేషన్‌లో చినబాబు, పార్టీ శ్రేణులను నిర్బంధించిన పోలీసులు

కోటనందూరు: తుని మున్సిపాలిటీ వైస్‌చైర్మన్-2 ఎన్నికలో కూటమి నేతలు దౌర్జన్యం చేస్తున్న కారణంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు మద్దతుగా తుని వెళ్తున్న ఆ పార్టీ కోటనందూరు మండల కన్వీనర్ చింతకాయల చినబాబును, అతని అనుచరులను సోమవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. తుని వెళ్ల కూడదంటూ పోలీసుస్టేషన్‌లో నిర్బంధించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ కూటమి నేతల అరాచకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని కూటమి నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

ఆరుతడి పంటలే పండించాలి

ప్రత్తిపాడు: ప్రస్తుత రబీ సీజన్‌లో ఆరుతడి పంటలే పండించాలని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ సూచించారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సాగునీటి సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రబీ సీజన్‌లో సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులను సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు నీటి సంఘ చైర్మన్ ఇళ్ల అప్పారావు కోరారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ పంట దెబ్బతిందని, దీంతో ఎక్కువ మంది రైతులు రబీ సీజన్‌లో కూడా వరి పండిస్తున్నట్టు చెప్పారు. రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని జగ్గంపేట వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ కోరారు. సమావేశంలో నీటి పారుదలశాఖ ఏఈ ఎస్కే ఇబ్రహీం, ఆర్ఐ ఎ.గోపాలకృష్ణ, వివిధ నీటి సంఘాల అధ్యక్షులు, మెంబర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన కల్యాణ మంగాదేవి ఆలయ 24వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ చైర్మన్, మాజీ ఎంపీపీ డీవీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాసరి సీతారామకృష్ణ, కనకలక్ష్మి దంపతులు పీఠలపై కూర్చొని పూజలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సోమవరంలో పొక్లెయిన్‌తో వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

కిర్లంపూడి: పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధను చూపాలని సర్పంచ్ జ్యోతుల సీతారామలక్ష్మి సూచించారు. మండలంలోని సోమవరం గ్రామంలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ సీహెచ్ రాంబాబు ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైనేజీల్లో పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లారు.

శివరాత్రి ఏర్పాట్లు షురూ !

- బ్రాహ్మణ రేవు వద్ద నిర్మాణ పనులు ప్రారంభం
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరుతున్న ప్రజలు



ఏలేరునది ఒడ్డున చేపడుతున్న నిర్మాణ పనులు



గతేడాది నిర్మించి వృథాగా ఉన్న మెట్లు

ఏలేశ్వరం: పెద్దాయన వస్తే మళ్లీ మొదటి నుంచి మొదలు పెడతారు అనే సామెత ఏలేశ్వరం నగర పంచాయతీకి సరిగ్గా సరిపోతుంది. ఏటా మహాశివరాత్రికి భక్తుల సౌకర్యార్థం నగర పంచాయతీ నిధులతో బ్రాహ్మణ రేవు వద్ద నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనులు నాసిరకంగా ఉండడంతో శివరాత్రి వచ్చే సరికి అవే పనులు మళ్లీ చేపడుతున్నారు. ఇలా ఏటా రూ.లక్షల్లో ప్రజాధనం వృథాగా పోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శివరాత్రికి బ్రాహ్మణ రేవు వద్ద మెట్లతో పాటు ఒడ్డున పలు నిర్మాణాలు చేపడుతున్నారు. గతేడాది ఏకంగా రూ.40 లక్షలతో తూతూమంత్రంగా పనులు చేశారు. అవి వరదలకు కొట్టుకుపోయాయి. అలాగే కొన్ని నిర్మాణ పనులు వృథాగా చేపట్టారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది రూ.4 లక్షలతో అక్కడే నిర్మాణ పనులు చేపట్టారు. ప్రతి ఏడాది నిర్మాణ పనులు చేపడుతున్నా శివరాత్రి వచ్చేసరికి పనులు మొదటికి వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా ముందుచూపుతో వ్యవహరించి నాణ్యమైన పనులు చేపట్టి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మరోసారి బయటపడ్డ వర్గపోరు

ఏలేశ్వరం నగర పంచాయతీలోని టీడీపీలో వర్గపోరు తీవ్రరూపం దాల్చింది. దీనికి శివరాత్రి ఏర్పాట్లలో భాగంగా ఏలేరునది ఒడ్డున చేపట్టిన నిర్మాణ పనులు సాక్ష్యంగా నిలిచాయి. శివరాత్రికి భక్తులకు సౌకర్యం నిమిత్తం ఏలేరు నది ఒడ్డున నిర్మాణ పనులకు నగర పంచాయతీ నిధులు రూ.4 లక్షలు కేటాయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనుమతి లేకుండా స్థానిక టీడీపీ నేత తన అనుచరులకు ఈ పనులు అప్పగించారు. దీంతో చైర్‌పర్సన్ ఆగ్రహించి పనులను అడ్డుకోవడంతో ఆటంకం కలిగింది. ఇరువర్గాలకు నచ్చచెప్పలేక అధికారులు గగ్గోలు పెడుతున్నారు. ఎట్టకేలకు పనులు ప్రారంభం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. టీడీపీలోని వర్గపోరు తమకు ప్రాణసంకటంగా మారిందని అధికారులు వాపోతున్నారు.

భక్తులకు వసతులు కల్పించాలి



శివరాత్రికి ఏలేరు నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు వసతులు కల్పించాలి. భక్తులకు ఇబ్బంది లేకుండా బ్రాహ్మణ రేవు వద్ద ఏర్పాట్లు చేయాలి. మహిళలు, పిల్లలకు పూర్తిస్థాయిలో రక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– సుంకర రాంబాబు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ఏలేశ్వరం

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మహా శివరాత్రిని పురస్కరించుకుని ఏలేరు నది వద్ద చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. నాసిరకంగా పలు చేయడంతో ఏటా లక్షలాది రూపాయలు వృథాగా పోతున్నాయి. ఈసారైనా అధికారులు ముందు చూపుతో వ్యవహరించి నాణ్యత ఉండేలా చూడాలి.

–పైల విజయ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్, ఏలేశ్వరం

హామీలు అమలు చేయాలంటూ ధర్నా



ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



తునిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



శంఖవరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ప్రత్తిపాడు: కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ఆందోళనకు సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాపర్తి రామలింగేశ్వరరావు, ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాకరాపల్లి సునీత, అల్లాడి లక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక తుంగలోకి తొక్కారని ఆరోపించారు. జూలై నెలలో వేతనాలు పెంచుతామని, మరో 11 డిమాండ్లు పరిష్కరిస్తామంటూ మినిట్స్ కాపీ ఆధారంగా కూటమి నేతలు హామీలిచ్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని మంత్రులు, ముఖ్యమంత్రికి విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం కార్మికులపై పనిభారం పెంచుతుందే తప్ప వారి ఆర్థిక కష్టాలను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పదోన్నతుల్లో రాజకీయ జోక్యం తగదని, రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.హేమలత, టి.నాగసత్యవతి, ఎస్.అమలావతి, ఎంపీ పద్మావతి, పి.జ్యోతి, పి.భవాని, ఎం.నాగలక్ష్మి, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.రాజబాబుతో పాటు ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని అంగన్‌వాడీల ధర్నా

తుని: పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల జీతాలు పెంచాలని సీఐటీయూ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐసీడీఎస్ తుని అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ, పిల్లలకు అమ్మకు వందనం పథకం వర్తింప చేయాలని నినాదాలు చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. సీఐటీయూ నాయకురాలు పద్మ, అంగన్‌వాడీ తుని అర్బన్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు మేరీ సమాదానం, ధనలక్ష్మి పాల్గొన్నారు.

శంఖవరం: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని కోరుతూ శంఖవరంలో సోమవారం ధర్నా చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ తాతారావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివనాగబాబు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లేపల్లికి చెందిన ఎడ్ల సామేలు (30) మద్యానికి బానిసయ్యాడు. ఏ పని చేయకుండా తిరగడంతో పాటు సెల్‌ఫోన్ కొనడానికి తన తల్లిని డబ్బులు అడగ్గా ఆమె లేవని చెప్పడంతో మనస్థాపం చెంది ఆదివారం పురుగు మందు తాగాడు. బంధువులు అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్టు పేర్కొన్నారు. దీనిపై మృతుడి సోదరుడు సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సారా తరలిస్తున్న నలుగురికి రిమాండ్

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ సమీపంలో బైక్‌పై సారా తరలిస్తున్న నలుగురు వ్యక్తులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు గోకవరం ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇటికాయలపల్లికి చెందిన నలుగురు యువకులు ఆదివారం సాయంత్రం కృష్ణునిపాలెం పంచాయతీ సమీపంలో బైక్‌పై సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపర్చగా జడ్జి వీరికి 14 రోజులు రిమాండ్ విధించారని చెప్పారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో లంపకలోవ కరాటే విద్యార్థులు

ప్రత్తిపాడు: కాకినాడలో ఇటీవల జరిగిన రెండో ఇంటర్ స్టేట్ రైయాన్ ర్యూ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ కాటాస్ విభాగంలో ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా ఇద్దరికి ప్రథమ, ఒకరికి ద్వితీయ, నలుగురు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారని కరాటే మాస్టర్ పి.బుజ్జి తెలిపారు. విజేతలందరూ ఒమ్మంగి శ్రీభారతి విద్యాలయానికి చెందినవారే అన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన బి.చైతన్య, వి.పావని, ద్వితీయ స్థానంలో టి.నవ్యశ్రీ, తృతీయ స్థానంలో టి.సుకాంత్, ఎస్.కార్తిక్, ఇ.గంగాలక్ష్మి, ఇ.శ్రీలక్ష్మిలకు నిర్వాహక కమిటీ ప్రతినిధి, కరాటే మాస్టర్ సూర్య ప్రశంసా పత్రాలను అందజేశారని తెలిపారు. విజేతలను సోమవారం సాయంత్రం శ్రీభారతి విద్యాలయ కరస్పాండెంట్ సుంకర వీరబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

వారానికి మూడు రోజులే మాంసం దుకాణాలు



ప్రత్తిపాడులో చికెన్, మటన్ వ్యాపారులతో మాట్లాడుతున్న కార్యదర్శి పద్మరాజు

ప్రత్తిపాడు: ప్రాణాంతకమైన బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో ఇకపై చికెన్ దుకాణాలను వారానికి మూడు రోజులే నిర్వహించాలని ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు సూచించారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం చికెన్, మటన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మటన్ విక్రయదారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీలు వేసిన తర్వాతే మాంసం విక్రయించాలని ఆదేశించారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు వారంలో ఆది, మంగళ, బుధవారాల్లో మాత్రమే చికెన్ దుకాణాలను నిర్వహించాలన్నారు. కోళ్లు, మేకలు, గొర్రెల వ్యర్థాలను గ్రామానికి దూరంగా నిర్జన ప్రదేశాల్లో విడిచిపెట్టాలన్నారు. చెరువులు, చేపల చెరువుల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠ



ఇర్రిపాకలో ప్రతిష్ఠించిన వేంకటేశ్వరస్వామి విగ్రహం

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాక ఏలేరు నదీతీరంలో శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. తొలుత తొమ్మిది అడుగుల వేంకటేశ్వరస్వామి, కోటిలింగేశ్వర స్వామి, నందీశ్వరస్వామి విగ్రహాలను క్రేన్ సాయంతో నిర్దిష్ట ప్రదేశానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ దివ్య ఆశీస్సులతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అతని కుటుంబ సభ్యులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఇర్రిపాక గ్రామం కిక్కిరిసిపోయింది. విగ్రహ ప్రతిష్ఠలో శృంగేరి పీఠం ఆంధ్రా, తెలంగాణ ప్రచారకర్త బంగారయ్య శర్మ, వారణాసి శృంగేరి పీఠం ఇన్‌చార్జి ఇంద్రకంటి సత్యం, వివిధ ప్రాంతాలకు చెందిన స్వామీజీలు, మాతలు, టీటీడీ పాలక మండలి సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: మహిళా సంఘాలు ఆర్థిక పరిపుష్టిని సాధించి, బలోపేతం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ అద్దంకి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం జరిగిన సమాఖ్య నెలవారీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల పనితీరును ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలన్నారు. ఎంఎఫ్ఐ రుణాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల సమాఖ్య కార్యకలాపాలు, వివరాలను ఏపీఎం వై.వెంకట్‌ను అడిగి తెలుసుకున్నారు. శ్రీనిధి ఉన్నతి తదితర పథకాలను డీఆర్‌డీఏ పీడీ అద్దంకి శ్రీనివాసరావు వివరించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్, ఈ-శ్రమ పోర్టల్‌పై ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అవగాహన కల్పించారు. అనంతరం సమాఖ్య కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీఏ పీడీ అద్దంకి శ్రీనివాసరావు మొక్కలను నాటారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లోవకుమారి, సీసీలు శ్రీనివాస్, శ్రీను, నాగరత్నం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు గిరిబాబు పరామర్శ



ప్రత్తిపాడులో పిల్లా చిట్టిబ్బాయిని పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పలువురు మృతుల కుటుంబాలను సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. ప్రత్తిపాడులో పిల్లా సీతయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సీతయ్య తండ్రి పిల్లా చిట్టిబ్బాయిని గిరిబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల మృతి చెందిన కర్రెడ్ల సత్తిబాబు, పాలిశెట్టి ఈశ్వరరావు కుటుంబాలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. వేములపాలెంలో వైఎస్సార్ సీపీ నేత చందక నాని తండ్రి కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా నాని కుటుంబాన్ని గిరిబాబు పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను), పార్టీ నాయకులు శేరు కృష్ణ ఏలేశ్వరం వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రీస్కూల్స్‌ను బలోపేతం చేయడంపై అంగన్‌వాడీ టీచర్లకు రెండు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా మొదటి విడత మంగళవారం నుంచి 20వ తేదీ వరకూ, రెండో విడత 22 నుంచి 24 వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు సీడీపీఓ వివరించారు.

శంఖవరం: జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సుపై మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ ఎస్‌వీ రమణ అధ్యక్షతన మంగళవారం నుంచి ఈ నెల 25 వరకూ రెండు విడతలుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రౌతులపూడి: జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సుపై మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సోమవారం తెలిపారు. రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ ఏ.శ్రీనువాస్ అధ్యక్షతన మంగళవారం నుంచి ఈ నెల 25 వరకూ రెండు విడతలుగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు ధర్మవరంలో మంగళవారం నుంచి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. ప్రీస్కూల్స్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

హిట్లర్ వారసులుగా కూటమి నేతలు

మాజీ మంత్రి తోట నరసింహం



జగ్గంపేట పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న తోట నరసింహం

జగ్గంపేట: రాష్ట్రంలో కూటమి నేతలు నియంత హిట్లర్‌కు వారసులుగా మారి దౌర్జన్యాలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కూటమి నేతలు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడిచి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని ఆరోపించారు. తుని మున్సిపాలిటీలో సంఖ్యాబలం లేకపోయినా దౌర్జన్యాలు చేసి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. దీనిని అడ్డుకునేందుకు యత్నించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాపై దాడి చేయడానికి కూటమి నేతలు ప్రయత్నం చేశారన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కూటమి నేతలు ఇదే తరహాలో వ్యవహరిస్తుంటే అధికారులు, పోలీసులు వారికి వంత పాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తుని మున్సిపాలిటీలో జరిగే వైస్ చైర్మన్ ఎన్నికలో ఎలాంటి కుట్రలు జరగకుండా అడ్డుకునేందుకు చేపట్టిన చలో తుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్థానిక పాదాలమ్మ ఆలయం వద్ద గల శ్రీశారదా వయోవృద్ధ నిలయంలోని వృద్ధులకు సోమవారం పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తన కుమారుడు శివరామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని వృద్ధులకు వీటిని పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం నిధులు ఖర్చు చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

తుని రూరల్: సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. సోమవారం తుని మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి, మండలస్థాయి అధికారులతో మాట్లాడారు. వివిధ గ్రాంట్ల కింద ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను నిబంధనలను అనుసరించి సంబంధిత పనులకు వినియోగించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు గైరహాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తరచూ పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు విధిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అప్పగించే సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ కె.సాయి నవీన్, ఈఓపీఆర్‌డీ జి.మరిడియ్య, ఎంఈఓ పరవాడ గీతాదేవి, ఏసీడీపీఓ నిహారిక, ఏఓ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూములు ఆన్‌లైన్ చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

శంఖవరం: తమ భూములను ఆన్‌లైన్ చేయాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ తాతారావుకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని పి.మల్లాపురం పంచాయతీ పరిధిలోని సిద్ధివారిపాలెం, శృంగధార, యరకాపురం, అంకంపాలెం గ్రామాల్లో కొండపోడు భూములకు పాస్ పుస్తకాలు ఉన్నా ఆన్‌లైన్‌లో భూమి లేదన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో భూముల వివరాలు నమోదై ఉండేవని, అవి ప్రస్తుతం కనిపించడం లేదన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి గిరిజనులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఫార్మసీ విద్యార్థులకు అవగాహన సదస్సు



ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ విద్యార్థులకు క్లినికల్ రీసెర్చ్ ఫార్మా కోవిజిలెన్స్, మ్యాటీరియోవిజిలెన్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డి.సతీష్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన క్లినెట్రా సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ రాజశేఖర్ దంతా ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోగ్య సంరక్షణ, రోగులు భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫార్మా కోవిజిలెన్స్ డేటాబేస్ సాఫ్ట్‌వేర్ టూల్‌ను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.